ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 17 జూలై 2025

మాచర్ల మార్కెట్ యార్డుకు.. మహర్దశ

- రూ. 2 కోట్ల 7 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్
- నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ

మాచర్లటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మార్కెట్‌యార్డు ఆవరణలో షాపుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. గుంటూరు వెళ్లే ప్రధాన రహదారికి పక్కన ఉన్న ప్రధాన ద్వారాని ఇరుపక్కల నూతనంగా 24 కమర్షియల్ దుకాణాలు నిర్మాణాలకు రూ. 2 కోట్ల 7 లక్షల 50 వేల నిధులు కేటాయిస్తూ ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నూతన దుకాణాల నిర్మాణంతోపాటు మార్కెట్‌యార్డు ఈశాన్యంలో నుంచి రాకపోకలు సాగించేదుకు నూతనగా ఆర్చీ నిర్మించి, గేటును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా నూతన నిర్మాణాలకు నిధులు కేటాయింపుపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పల్నాడు ప్రాంతంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన మాచర్లకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వని విధంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిధులు కేటాయిస్తూ నియోజకవర్గం అభివృద్ధికి క్షేత్రస్థాయిలో చేయూతనిస్తున్నారని స్పష్టం చేశారు. త్వరలో ఈ నిర్మాణాలకు సంబంధించి ముఖ్య నాయకులతో శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని వివరించారు. యార్డు స్వయం ఆదాయాన్ని పెంపొందించడానికి నూతన దుకాణాల నిర్మాణాలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



మాచర్ల మార్కెట్ యార్డు



యార్డు పాలకవర్గం ఎప్పుడో?

- కొలిక్కిరాని కూర్పు.. నేతల్లో నిరుత్సాహం
- కమిటీ నియామకంలో 13 నెలలుగా జాప్యం

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతి పెద్దది.. రాష్ట్రంలోనే పెద్దమొత్తంలో స్థిరాస్తులు, వార్షిక ఆదాయం.. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) కలిగి ఉన్నది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న మిర్చియార్డుకు పాలకవర్గాన్ని నియమించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచిపోయింది. అయినా మిర్చి యార్డు విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నది. సాధారణంగా మార్కెట్ కమిటీ పదవీకాలం ఏడాదిగా నిర్ణయించారు. కమిటీలో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు పది మంది సభ్యులకు చోటు కల్పించొచ్చు. ఐదేళ్ల పాటు పాలకవర్గాలను నియమిస్తే 50 మంది పార్టీ కార్యకర్తలకు పదవులు ఇవ్వొచ్చు. అలాంటిది ఇప్పటికే ఏడాది ముగిసిపోయిన దృష్ట్యా ఇప్పటి నుంచి వరుసగా నియమిస్తే 40 మందికే పదవులు ఇచ్చి గౌరవించొచ్చు. ఇంకాస్త ఆలస్యం చేస్తే ఈ సంఖ్య కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవికి ఎంతో డిమాండ్ ఉన్నది. ఇందుకు కారణం ఈ మార్కెట్ కమిటీకి దేశ, విదేశాల్లో పేరు, ప్రఖ్యాతలు గడించడమే. ఏటా రాష్ట్రంలోని మిర్చి పండించే జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రైతులు ఇక్కడ మిర్చిని విక్రయించడానికి వస్తుంటారు. అలానే పత్తి సీజన్ లోనూ సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈ విధంగా యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ఏటా సమకూరుతుంది. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు, రైతులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు అవకాశం ఉన్నది. ఇక మిర్చి టర్నోవర్ అయితే ఏకంగా రూ.15 వేల కోట్లకు పైగా జరుగుతుంది.

గతంలోనూ ఇలానే నాన్చుడు

2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా యార్డు పాలకవర్గాన్ని వెంటనే నియమించలేదు. పార్టీ అధికారంలోకి వచ్చిన ఇంచుమించు రెండేళ్ల తర్వాత కమిటీని ఏర్పాటు చేసింది. ఆ విధంగా రెండో విడత కమిటీని నియమించే సరికి 2019 ఎన్నికల వాతావరణం వచ్చేసింది. దాంతో రెండో విడతలో పదవులు పొందిన నాయకులు పట్టుమని పది నెలలైనా పాలకవర్గంలో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కమిటీని నియమించడానికి ఎలాంటి కోర్టు అడ్డంకులు లేవు. పార్టీలో ఏకాభిప్రాయం మాత్రమే కుదరాలి. ప్రభుత్వంలో టీడీపీతో జనసేన, బీజేపీ కూడా భాగస్వామ్యమై ఉన్నందున దామాషా ప్రకారం ఆ పార్టీలకు చెందిన నాయకుల కు కూడా ఒకటి రెండు పదవులు కమిటీలో ఇస్తే సరిపోతుంది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావడంతో ఆశావహులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనౌతున్నారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా నాయకత్వం రాష్ట్ర నేతల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పాలకవర్గం నియమిస్తే కొంతమందికి పదవులు ఇచ్చి న్యాయం చేసినట్లు అవుతుంది.

మూతబడిలు

ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 120

ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి.. ఇక పాఠశాలల్లో కొరత ఉండదు.. విద్యార్థులకు ఇబ్బందులు తప్పినట్లే.. అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు భావించాయి. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పాఠశాలల్లో పరిస్థితి నెలకొంది. అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతపడుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో తలుపులు ఆయాలే తీయాల్సి వస్తోంది.

- 25 పాఠశాలల్లో తలుపులు తీస్తున్న ఆయాలు
- క్లస్టర్లలో ఖాళీగా 200 మందికి పైగా ఉపాధ్యాయులు
- ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన



నరసరావుపేట జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా.. బదిలీలు పూర్తి అయి నెల గడిచినా ఇంకా అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల్లో గందరగోళ పరిస్థితులే ఉన్నాయి. ప్రధానంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో అయితే పరిస్థితి దారుణంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 120కి పైగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. కొంతమంది ఉపాధ్యాయులు బదిలీల్లో వ్యూహాత్మకంగా క్లస్టర్లను కోరుకుని దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీపై వెళ్లకుండా తప్పించుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసి కూడా విద్యాశాఖ అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారని అందువల్లే పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూత పడే పరిస్థితి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇటీవల దాదాపు 5,000 మందికి పైగా ఉపాధ్యాయులకు బదిలీలు జరిగినా ఇంకా అనేక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరు. దీనినిబట్టి ఉపాధ్యాయ బదిలీలు ఏ విధంగా జరిగాయో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉపాధ్యాయులు లేక పాఠశాలలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వెల్దుర్తి, బెల్లంకొండ, పిడుగురాళ్ల తదితర (మిగతా 6వ పేజీలో)

వలంటీర్లను నియమించినా..

మూడు జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే పరిస్థితులు నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో వలంటీర్లతో సరిపెడుతున్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు సహకారంతో విద్యా వలంటీర్లను నియమించిన అత్యధిక పాఠశాలల్లో ఇంకా ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉంది. వెల్దుర్తి మండల పరిధిలోని పాఠశాలల్లో అసిస్ట్ అనే సంస్థ 16 మంది విద్యా వలంటీర్లను నియమించిందని వెల్దుర్తి ఇన్చార్జి ఎంఈవో ఖాసిం తెలిపారు. వారికి నెలకు రూ.8000 చెల్లించేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు.

వినతుల స్వీకరణ.. పరిష్కారానికి హామీ



- 67వ రోజు మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్
- స్వయంగా కలిసి సమస్యలు విన్నవించిన ప్రజలు

బాపట్ల టౌన్‌హాలుకు 120 వసంతాలు



6

వసతి.. వారెవ్వా



- కుక్కల కోసం ఏసీ హాస్టళ్లు
- ఆహ్లాదకరంగా డాగీస్ జోన్ల ఏర్పాటు
- నిద్రకు బెడ్లు..ఆడుకునేందుకు బొమ్మలు

నేడు దాచేపల్లిలో.. కిసాన్ మేళా



- శాఖల వారీగా 100 రకాల స్టాళ్ల ఏర్పాటు
- వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచేలా సదస్సు



కిసాన్ మేళా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



- కిసాన్ మేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నీటికుంట

దాచేపల్లి, పిడుగురాళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాగు.. తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడులు.. మేలైన యజమాన్య పద్ధతులు.. తదితరాలపై రైతులకు అవగాహన పెంచేలా గురువారం దాచేపల్లి మార్కెట్ యార్డులో కిసాన్ మేళా జరగనున్నది. పాత పద్ధతులతో వ్యవసాయం చేస్తూ దిగుబడులు సాధించడంలో నియోజకవర్గ రైతులు వెనుకబడి ఉండటంతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దాచేపల్లిలో కిసాన్ మేళా ఏర్పాటు చేయించారు. వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ, ఉద్యాన, మత్స్యశాఖ, అటవీ, మైక్రో ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం, ఐసీడీఎస్, భూసార పరీక్ష లు, ఆగ్రి టెస్టింగ్ ల్యాబ్, తదితర 100 రకాల స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. రైతులకు ఉపయోగపడే సూచనలు, సలహా లతో పాటు ప్రకృతి వ్యవసాయం, అధిక దిగుబడి సాధించే యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో, ముఖాముఖి చర్చ జరిగేలా కిసాన్ మేళా జరగనున్నది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే యరపతినేని బుధవారం వివిధ శాఖల అధికారులతో మార్కెట్‌యార్డులో సమీక్ష నిర్వహించారు. నియోజక వర్గంలోని ప్రతీ గ్రామం నుంచి 20 మంది చొప్పున నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 5 వేల మంది రైతులు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు మేలు చేసే విధంగా కిసాన్ మేళా ఉపయోగపడాలని సూచించారు. కిసాన్ మేళాకు ఎమ్మెల్యేతో పాటు ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ శివన్నారాయణ, డాక్టర్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు హాజరుకానున్నారు.



రహదారిపై రైతుల ధర్నా

పొగాకును మద్దతు ధర ఇవ్వాలని నిరసన

దాచేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పొగాకును కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బుధవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై పొగాకును రోడ్డుపై వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొగాకును కొనుగోలు చేసిన అధికారులు రైతులు తెచ్చిన పొగాకు బేడ్లను నామమాత్రంగా కొనుగోలు చేయటంతో పాటు తక్కువ ధరకు అడుగుతున్నారని ఆరోపించారు. గతంలో రూ.18వేల నుంచి రూ 20వేలకు ఉన్న పొగాకు ఇప్పుడు మూడు నుంచి నాలుగు వేలకు అడగటంతో పాటు యార్డుకు వచ్చిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయకుండా ఒకటి రెండు బేళ్లను మాత్రమే కొనుగోలు చేసి రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఇరువైపులా కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ నిలిచి పోవటంతో సమాచారం అందుకున్న గురజాల సీఐ భాస్కరరావు రైతులతో మాట్లాడి సమాధాన పరిచారు. అనంతరం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాలతో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ ఏవో శ్రీ కృష్ణ దేవరాయలు, దాచేపల్లి తహసీల్దార్ జీ శ్రీనివాస్‌లు ఎఫ్‌సీఐ గోడౌన్‌కు వద్దకు చేరుకొని రైతులతో సంప్రదింపులు జరిపారు. పొగాకు కొనుగోలు చేస్తున్న అధికారులతో నేరుగా మాట్లాడి రైతులతో సమస్యలను పరిష్కరించారు. తహసీల్దార్ అక్కడే ఉండి కొనుగోళ్ళు పరిశీలించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తపరిచారు.

బాలల భవిష్యత్తుకు.. బంగారు బాట

అంగన్ వాడీలకు ఆధార్ శిల పుస్తకాల పంపిణీ 8

6 పోలీస్ విచారణకు హాజరైన గుంటూరు మాజీ మేయర్ కావటి

బంగారు కుటుంబాలకూ.. సంక్షేమ పథకాలు

- పీ-4పై అపోహలను తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యం)పై బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పేదరికం నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ల సిబ్బందిని ఆదేశించారు. పీ-4లో భాగస్వాములైతే ఇతర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతామన్న బంగారు కుటుంబాల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించాలన్నారు. పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థలు చేపడుతున్న పేదరిక నిర్మూలన కార్యక్రమాలను పీ-4 కార్యక్రమాలుగా గుర్తిస్తామన్నారు. బంగారు కుటుంబాల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలని కనడం జాతికి ఎంతఅవసరమో ప్రజలకు తెలియచేయాలన్నారు. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తల్లికి వందనం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరవుతాయన్నారు. రానున్న రోజుల్లో ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు మరిన్ని ప్రోత్సాహాలు అందించనున్నామన్నారు. సమావేశంలో సీపీవో శ్రీనివాస్, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌర పలకలు ఏర్పాటు చేసుకోవాలి

రాజుపాలెం మండలంలో కలెక్టర్ పర్యటన



గణపవరంలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

రాజుపాలెం, జూలై16(ఆంధ్రజ్యోతి : సత్తెనపల్లి నియోజకవర్గంలో 10 వేల మంది లబ్ధిదారుల ఇళ్లపై సూర్యఘర్ పథకం ద్వారా సౌర పలకలు ఏర్పాటు చేయనున్నట్లు పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని గణపవరం, అనుపాలెం, రాజుపాలెం, చౌటపాపాయపాలెం, బ్రాహ్మణపల్లి గ్రామాలలో బుధవారం జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు పర్యటించారు. మొదట గణపవరం గ్రామంలోని జి పద్మవతి ఇంటిపై పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ పలకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1000 గృహాలపై సోలార్ పలకలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రాజుపాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కాన్పులకు మొదటి ఎంపిక ప్రభుత్వ ఆసుపత్రులే అయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫామ్ పాండ్‌తో లాభాల గురించి రైతులను చైతన్య పరచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, డీఈవో చంద్రకళ, డ్వామా పిడి సిద్ధలింగమూర్తి, ఏపీ ఎంఐపీ పీడి అంజనేయులు, తహశీల్దార్ దుర్గేశ్వరరావు, ఎంపీడీవో జివి సత్యనారాయణ, ఎంఈవోలు మల్లిఖర్జున శర్మ, నరసింహరావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడి పాత్రలో కలెక్టర్



అనుపాలెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థు లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఐదవ తరగతి గదిలోకి వెళ్లారు. అక్కడ ఉన్న కుర్చీలో కుర్చోని ప్రతి ఒక్కరిని తన దగ్గరకు పిలిచి ఇంగ్లీష్ పుస్తకంను తీసి చదవమన్నారు. విద్యార్థులందరూ పుస్తకం చదవటంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేదెప్పుడు

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆందోళన



మాట్లాడుతున్న ఎన్ వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య), 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు పూర్తై 45 రోజులు అయినా ఇంకా అనేకమంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బదిలీలు చేసే ముందు ఆర్థికశాఖ అనుమతి తీసుకోవడం, క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ బాధ్యత తీసుకోవాల్సిన విద్యాశాఖ పట్టించుకోలేదన్నారు. ఫలితంగా ఉపాధ్యాయులకు జీతాలు అందలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్. సహధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, షకీలా బేగం, టీ ఆంజనేయులు, కే కేదార్‌నాధ్, కే ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లను ఆన్ డ్యూటీగా పరిగణించాలి

● పంచాయతీరాజ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న కూచిపూడి మోహన్‌రావు

గుంటూరు సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని లైన్ డిపార్ట్మెంట్స్‌లో ఉద్యోగుల డిప్యూటేషన్లను ఆన్ డ్యూటీగా పరిగణించాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కూచిపూడి మోహన్‌రావు తెలిపారు. బుధవారం గుంటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పూర్ణ చంద్ర రెడ్డి, గుంటుపల్లి శ్రీనివాస్, శామ్యూల్ పాల్, నిర్మలభారతి, సీహెచ్ శ్రీనివాస్, మల్లేశ్వరరావు, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను వంచించిన జగన్ : ప్రత్తిపాటి విమర్శ

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్నో హామీలు ఇచ్చి ఐదేళ్ళు పాలన చేసిన జగన్ ఒక్కటీ నెరవేర్చకుండా వంచించారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ తన తప్పు ఒప్పుకుని తక్షణమే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం, వెలిగొండ. గుండ్రేవుల, గుండ్లకమ్మ, రాళ్లపాడు, సోమశిల, ఎత్తిపోతల పథకాలు ఎందుకు పూర్తిచేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గానికో కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తానని, రైతులకు పగటిపూట నాణ్యమైన 9 గంటల విద్యుత్ ఉచితంగా ఇస్తానని చెప్పి, ట్రూఅప్ ఛార్జీల పేరుతో బిల్లుల భారం మోపాడని విమర్శించారు. రూ.4 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధి, రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఏడాదిలో 80 శాతం హామీలు అమలు చేసిన చంద్రబాబును ఏ ముఖం పెట్టుకొని ప్రశ్నిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.

కృష్ణానదిలో 1.14 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలు

● గుంటూరు వైపున 74.78 లక్షల సీఎంలు
● ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలో 39.48 క్యూబిక్ మీటర్లు
● హైడ్రోగ్రాఫిక్ సర్వే ద్వారా గుర్తించిన కేసీ డివిజన్

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఇసుక దిబ్బలను గుర్తించేందుకు కృష్ణా రివర్ కన్జర్వేట్ డివిజన్ నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వేలో ఆశాజనక నివేదిక వచ్చింది. ప్రకాశం బ్యారేజ్ ఎగువన నిర్వహించిన ఈ సర్వే ద్వారా కోటికి పైగా క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలున్నట్లు తేలింది. ఈ నివేదికని ఇటీవలే ఆ శాఖ జిల్లా యంత్రాంగానికి నివేదించింది. అందులోనూ గుంటూరు జిల్లా వైపున ఎక్కువ మోతాదులో ఇసుక దిబ్బలు ఉండటం విశేషం. ఆ ఇసుకని బయటకు తీయడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి కొరత లేకుండా చూడొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. సాధ్యమైనంత త్వరగా ఒక ఏజెన్సీని ఎంపిక చేసి బ్యారేజ్‌లో పేరుకుపోయిన ఇసుక నిల్వలను బయటకు తీయాలని మైనింగ్ అధికారులు కోరారు.

ప్రకాశం బ్యారేజ్‌లో పేరుకుపోయిన ఇసుక, మట్టి దిబ్బలను తొలగించాలన్న ప్రతిపాదన గత కొన్నేళ్లుగా ఉన్నది. అయితే ఇందుకు తగిన అనుమతులు లభించలేదు. దీని వలన నది అడుగు భాగం నుంచి దిబ్బలు పెరుగుతూ పైకి వచ్చి వరదనీటి ప్రవాహ వేగాన్ని మందగించేలా చేస్తున్నాయి. అలానే ప్రవాహ దిశను మారుస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురిసి కృష్ణానదికి 15 రోజులకు పైగా వరద ప్రవాహం పోటెత్తింది. అప్పట్లో గరిష్ఠ నీటి ప్రవాహం నమోదైంది. దాంతో కరకట్టకు ఎక్కడ ప్రమాదం వాటిల్లుతుందోనని అంతా ఆందోళన చెందారు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న కేసీ డివిజన్ హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహణ చేపడతామని, అందుకు అయ్యే ఖర్చులు భరించాలని గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాలను కోరింది. అందుకు రెండు జిల్లాలు సమ్మతించడంతో హైడ్రోగ్రాఫిక్ సర్వేని నిర్వహించింది. ఇందుకోసం రూ. 48 లక్షలు ఖర్చు కాగా రూ. 24 లక్షల చొప్పున రెండు జిల్లాలు చెల్లించాయి.

సర్వే నిర్వహించిన బీఎస్‌పీ హైడ్రో డ్రెడ్జింగ్ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కోటి 14 లక్షల 26 వేల 836.10 క్యూబిక్ మీటర్ల ఇసుక, మట్టి దిబ్బలు ఉన్నట్లు గుర్తించింది. ఇందులో గుంటూరు జిల్లా వైపున 74 లక్షల 78 వేల 627.30 క్యూబిక్‌మీటర్లు, ఎన్‌టీఆర్ జిల్లా వైపున 39 లక్షల 48 వేల 208.80 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలున్నట్లు నివేదించింది. ఈ సర్వేని అత్యంత శాస్త్రీయంగా నిర్వహించారు. పడవలను ఉపయోగించి ఎకో సౌండింగ్ ద్వారా నిర్వహించి ఇసుక నిల్వలను అంచనా వేశారు. అమరావతి రాజధాని అవసరాలకు ఇసుక భారీ మోతాదులో అవసరం ఉన్న దృష్ట్యా నదిలో ఉన్న ఇసుకని తీసేందుకు ప్రభుత్వం ఒక ఏజెన్సీని ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టింది.



హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహించే విధానం

విద్యుదుత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

సిబ్బందితో హైడల్ డైరక్టర్ ఎం.సుజయ్‌కుమార్

రెంటచింతల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని, ఏపీ జెన్‌కో హైడల్(జలవిద్యుత్) డైరక్టర్ ఎం.సుజయ్‌కుమార్ తెలిపారు. సత్రశాలలోని సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులతో బుధవారం ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ రూమ్)లో ఆయన సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఏటా విద్యుదుత్పత్తి లక్ష్యం 78 ఎంయూలు కాగా ఈ సారి 80 ఎంయూలకు పెంచి 2026 మార్చి 26 లోపు ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ఈ ఏడాది 92.427 ఎంయూల విద్యుత్ తయారు చేశారని అభినందించారు. పదిహేను రోజుల నుంచి రెండు యూనిట్ల ద్వారా 4.47 ఎంయూల కరెంట్ తయారైనట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకరమణ తెలిపారు. 20 రేడియల్ క్రస్ట్‌గేట్లను పరిశీలించి లీకుల నివారణకు వ్యూహాన్ని అమలు చేయాలన్నారు. అన్ స్కిల్డ్ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు డైరక్టర్‌కు వివరించి క్యాడర్ ఉద్యోగులుగా మార్చాలని కోరారు. రూ.4 లక్షలతో జిమ్ కేంద్రాన్ని ప్రారంభించారు. రిజర్వాయర్ సమీపంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఈలు రవీంద్రారెడ్డి, జి.తిరుమల ప్రసాద్, నాగరాజు, చంద్రశేఖర్, జీఎం శ్రీనివాసరావు, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, వైఎస్ఆర్‌కే ప్రసాద్, ఏడీఈలు వెంకట రత్తయ్య, జయశంకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్లతో మాట్లాడుతున్న హైడల్ డైరక్టర్ ఎం.సుజయ్‌కుమార్

ఎంఎస్ఎంఈల సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ చైర్మన్‌కు రాష్ట్ర లఘు ఉద్యోగ భారతి కమిటీ విజ్ఞప్తి

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావును మంగళగిరిలోని కార్యాలయంలో బుధవారం లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు తులసి యోగీష్ చంద్ర ఆధ్వర్యంలోని రాష్ట్ర కమిటీ కలిసింది. పారిశ్రామికులకు అధిక విద్యుత్ చార్జీలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, ఆర్థిక సహాయం పొందటంలో ఇబ్బందులు, మెమొరాండం ఆఫ్ టైటిల్ డీడ్ (ఎంటీడీటీ) పై అధికంగా చార్జీలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కోశాధికారి ధరణీష్, ఉపాధ్యక్షులు కమల్ నయన్ భాంగ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి తోట రామకృష్ణ, ఈసీ సభ్యులు విఠల్ ప్రసాద్ ఉన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూ కమిటీ ఒక వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు నూతన రాష్ట్ర కమిటీకి అభినందనలు తెలుపుతూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తులసి యోగీష్ చంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న లఘు ఉద్యోగ భారతీ నాయకులు


విద్యుత్ భారాలపై దశలవారీ ఆందోళనలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలనే డిమాండ్లతో ప్రభుత్వంపై దశలవారీ ఆందోళనలు చేపడు తున్నట్లు వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు స్పష్టం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేకంగా బుధవారం, మల్లయ్య లింగం భవన్లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అకిటి అరుణ్‌కుమార్, లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, వై నేతాజీలు మాట్లాడుతూ ఆందోళనల్లో భాగంగా గురువారం నుంచి 22వ తేదీ వరకు సదస్సులు, 22 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు కాలనీ సమావే శాలు, 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 7న ప్రత్యేక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు పేర్కొన్నారు. ఆందోళనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఏఐటీ యూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏరువాక కార్మిక సంఘ నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

19 నుంచి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దామచర్ల శ్రీనివాస్, తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో 52వ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. అండర్-11 నుంచి సీనియర్స్ వరకు అన్ని విభాగాలతో పాటు, మాస్టర్స్ విభాగంలో అండర్-35+ నుంచి 70+ వరకు ఈ పోటీలు నిర్వహిస్తునట్టు పేర్కొ న్నారు. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు స్టేడియంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరావు, సతీష్ చంద్ర, కార్యదర్శి రాము, రమేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యలో ఇంటర్మీడియట్‌కు అవకాశం

దుర్గి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీవోఎస్ఎస్) ప్రారంభమైందని, దీని ద్వారా దూర విద్యా విధానంలో ఇంటర్మీడియట్ చదువుకోవచ్చని ప్రిన్సిపాల్ వేణు తెలిపారు. 15 సంవత్సరాలు నిండి, 10వ తరగతిలో ఉత్తీర్ణత పొంది ఏడాది గ్యాప్ కలిగి ఉండాలన్నారు. ఆర్ట్స్, సైన్స్ గ్రూపులు ఉన్నాయన్నారు. గృహిణులు, వయోజనులకి ఇది మంచి అవకాశం అన్నారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్: 98666 87226ను సంప్రదించాలన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 558.70 అడుగులు ఉంది. ఇది 229.36 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1650 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లోగా 1650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 65,900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

53,535 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 55,232 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,535 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,175 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13300
273	----	-----
341	10000	13400
4884	----	----
సూపర్ 10	10000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
షార్క్-1	10000	12200
బ్యాడిగి	10000	12300
దేవనూరు డీలక్స్	10000	12400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	10800
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12600
నెంబరు. 5	10000	13500
273	---	----
341	10000	13500
4884	10000	12500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13600
బ్యాడిగి	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500
తాలుకాయలు	4600	7000

పోలీస్ విచారణకు హాజరైన
గుంటూరు మాజీ మేయర్ కావటి

యడ్లపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో విచారణకు గుంటూరు మాజీ మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు హాజరయ్యారు. మే 9న గుంటూరుకు చెందిన తన్నీరు రాజేష్, కారసాని వెంకటరత్నం(32) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ చెంగిజ్‌ఖాన్‌పేట వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం, గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతిపై ఆమె సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి, డీజీపీలకు కూడా ఫిర్యాదు చేశారు. మరణించిన తన కుమారుడు బతికి ఉన్నప్పుడు కావటి శివనాగ మనోహర్ నాయుడు వద్ద పని చేశాడని, మరణించిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కావటి శివనాగమనోహర్‌నాయుడు, రాజేష్‌లను విచారించారు. మృతుడితో వారికి ఉన్న సంబంధాలు, ఘటన జరిగిన రోజున వారు ఎక్కడ ఉన్నారనే వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించారు. నిందితుల నుంచి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని రూరల్ సీఐ సుబ్బనాయుడు తెలిపారు

టిడ్కో పై నుంచి పడి వ్యక్తి మృతి



దాసరి బాలస్వామి (ఫైల్‌ఫొటో)

తెనాలి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగ్గడిగుంటపాలెం టిడ్కో భవనంపై నుంచి తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన దాసరిబాలస్వామి(20) అనే వ్యక్తి పడి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధ రాత్రి తర్వాత చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేసే బాలస్వామి మంగళవారం రాత్రి స్నేహితులను కలిసేందుకు టిడ్కో గృహాల వద్దకు వచ్చాడు. ఈ క్రమంలోనే టిడ్కో భవనంపై ఉన్న ట్యాంక్‌పై కూర్చుని ప్రమాదవశాత్తు కిందకు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

విధుల నుంచి వార్డెన్ తొలగింపు

కారంపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మోడల్ స్కూల్ వార్డెన్ సౌరీబాయిని విధుల నుంచి తొలగించినట్లు ఎంఈవో-2 రవికుమార్ తెలిపారు.విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు డీఈవో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల బాధ్యతతో ఉండాలని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తమకు సమాచారం అందించాలని విద్యార్థినులకు ఆయన సూచించారు.

రెండు కార్లు ఢీ.. వ్యక్తి మృతి

తాడికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నిడుముక్కలలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యారేజ్‌బ్యూరోలో పనిచేసే నలుగురు మహిళలు కారులో గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అమరావతి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు నిడుముక్కల దాటిన తర్వాత ఢీకొన్నాయి. గుంటూరు నుంచి వస్తున్న కారు డ్రైవర్ విజయవాడ యనమదలకుదురు గ్రామానికి చెందిన తాడంకి నాగేంద్రబాబు(36) అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు కార్లు స్పీడ్ మీద ఉండటంతో మృతుడు నాగేంద్రబాబు కారులో ఇరుక్కుపోయాడు. కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయటానికి గంటకుపైగా సమయం పట్టింది. అదే కారులో ప్రయాణిస్తున్న సీహెచ్.నవ్య, బీ.లక్ష్మీత్రివేణి, ఎల్.యశోధకృష్ణ, పీ.రజితలకు గాయాలయ్యాయి. 108లో వారిని గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అమరావతి నుంచి వస్తున్న కారు డ్రైవర్ వివరాలు తెలియరాలేదు.

మూతబడిలు

(5వ పేజీ తరువాయి)

మండలాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. బదిలీల సందర్భంగా ఇతర ప్రాంతంలోని పాఠశాలకు వెళ్లిన వారు అక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటే మిగిలిన వారు పాత స్థానాలకు రావాలి. అయితే అనేకమంది ఉపాధ్యాయులు పాత స్థానాలకు రాకపోవడంతో కొరత నెలకొందని సంఘాల నాయకులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని 25 పాఠశాలల్లో ఆయాలే తలుపులు తీస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయుల కొరతపై పల్నాడు జిల్లాలోని ఓ ఎంఈవో విద్యాశాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లారు. వెల్దుర్తి, బొల్లాపల్లి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉందని అధికారులకు తెలియజేశారు. దీంతో వెంటనే కొంతమంది ఉపాధ్యాయులను కొన్ని పాఠశాలల్లో అధికారులు సర్దుబాటు చేశారు.

క్లస్టర్లలో ఖాళీగా ఉపాధ్యాయులు

బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని క్లస్టర్ పరిధిలో ఖాళీలను కోరుకుని అతి తెలివి ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడాల్సి ఉండగా క్లస్టర్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు ఒక క్లస్టర్ పరిధిలో పదిమంది ఉపాధ్యాయులు ఉంటే ఆ క్లస్టర్లో పరిధిలోని పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే అక్కడికి వెళ్లి పాఠాలు బోధించాలి. అయితే దాదాపు 200 మందికి పైగా ఉపాధ్యాయులు క్లస్టర్లలో ఖాళీగా ఉంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. గుంటూరు నగరం నుంచి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు దాదాపు 30 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇందులో పదిమంది క్లస్టర్ ఉపాధ్యాయులు ఉన్నారు. బదిలీ అయిన క్లస్టర్ ఉపాధ్యాయుల్లో ఇద్దరు మాత్రమే విధుల్లో చేరగా ఎనిమిది మంది విధుల్లో చేరలేదు. సాక్షాత్తు విద్యామంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లోనే ఇలా ఉందంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

దేవాళమ్మ చెరువులో ఆక్రమణలు తొలగిస్తాం

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

ఎఫెక్ట్

మాచర్లటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవాళమ్మ చెరువులో ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే తొలగిస్తామని, ఎటువంటి నిర్మాణాలు జరగకుండా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని మున్సిపల్ కమిషనర్ దూళిపాళ్ల వేణుబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని దేవాళమ్మ చెరువులో ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో చెరువు స్థలంలో వ్యాపారం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చెరువులోని ఆక్రమణలను పరిశీలించారు. చెరువుకు సంబంధించి అనుమతి లేకుండా ఉన్న కట్టడాలను ముందస్తు నోటీసు లేకుండా తొలగించి, ఎటువంటి నిర్మాణాలు జరగకుండా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని కమిషనర్ వివరించారు.

సంక్షిప్తం...

● మాచర్ల రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తనిఖీ చేశారు. రోగులకు అందుస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట డాక్టర్ అరుణ్, డాక్టర్ పద్మావతి ఉన్నారు.

● మండలంలోని ముత్యాలంపాడులో బుధవారం హెల్త్ అసిస్టెంట్ మురళీధర్ ఆధ్వర్యాన డెంగీ మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించి ర్యాలీ జరిపారు.

● బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మాచర్ల పట్టణానికి చెందిన గాడి వెంకటేశ్వర్లు 100 మీటర్ల రన్నింగ్‌లో, లాంగ్‌జంప్‌లో సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ పి.ప్రభాకరరావు బుధవారం వెంకటేశ్వర్లును దుశ్శాలువలతో సన్మానించారు. పట్టణ వాసులు వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు.

● మాచర్లటౌన్: పట్టణంలోని పలు విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై బుధవారం రాష్ట్ర విజిలెన్స్ వ్యవసాయశాఖ ఆధ్వర్యాన దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు నెల్లూరు కన్నయ్య, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అపర్ణ, మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు జగదీశ్వరరెడ్డి, ఏవో పాప కుమారి, క్రోసూరు ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

● కారంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై బుధవారం ఎస్‌ఐ వాసు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకొని వారినుంచి రూ.1.75లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాలతోపాటు ఒక కారును పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● మండలంలోని మిరియాల విద్యుత్ ఉప కేంద్రంలో ఆర్‌డీఎస్ పథకం కింద నూతనంగా ఏర్పాటుచేసిన లైన్స్ బ్రేకర్స్‌కు మాచర్ల ఈఈ సింగయ్య ఆదేశాలకు బుధవారం ఏఈ వీరాంజనేయులు చార్జింగ్ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మిరియాల, లక్ష్మీపురం, ఒప్పిచర్ల గ్రామాలకు 24 గంటలు మూడు ఫేజ్‌ల కరెంట్ ఉంటుందన్నారు. పొలాలకు 9 గంటలపాటు త్రీ ఫేజ్ ఉంటుందన్నారు.

● దుర్గి: దుర్గిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బుధవారం విజలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. దుకాణాలు, ఎరువుల గోడౌన్లను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా ఉన్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో ఏడీఏ కన్నయ్య, విజిలెన్స్ సీఐ అపర్ణ, ఏవోలు వేణుగోపాల్, అమీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్: విత్తన దుకాణాల యజమానులు నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ అపర్ణ అన్నారు. బుధవారం గురజాలలోని విత్తనాల దుకాణాలను ఆకస్మిక తనిఖీచేసి పీసీలు లేని కారణంగా రూ.1.33కోట్ల విలువైన స్టాక్ అమ్మకాలను నిలిపివేశారు.

● మాచర్లటౌన్: హౌసింగ్ లేఅవుట్స్‌లో విద్యుత్ మోటార్లు, పైపులైన్లు, తీగలు దొంగతనాలకు గురవుతున్నాయని, వీటి వలన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని హౌసింగ్ ఏఈ మరియదాసు అన్నారు. దొంగతనాలను అరికట్టి లబ్ధిదారులకు మేలు చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు బుధవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

● రెంటచింతల: విద్యతోనే ఉజ్వల భవిషత్ లభిస్తుందని చదువుకున్న వారికిసమజంలో మంచి గౌరవ భావాలు లభిస్తాయని పరాశక్తి సిమెంట్స్ వైస్ ప్రసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు.బుధవారం మండలంలోని జెట్టిపాలెం,గోలి,మల్లవరం, పశర్లపాడు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 567 మంది బాల బాలికలకు నోట్‌బుక్స్,ఆట వస్తువులతో పాటు రాతకుపయోగించే పెన్నులు,పెన్సిళ్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో జీఎం రామకృష్ణారెడ్డి,ఏజీఎం మల్లిఖార్జున,వేణుగోపాలరెడ్డి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

● రెంటచింతలలో ఎరువులు,పురుగుమందుల దుకాణాలను వ్యవసాయ శాఖ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ శాఖల అధికారుల బృందం బుధవారం తనిఖీ చేశారు.రికార్డ్స్ తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ అపర్ణ, ఏవోలు కట్టా లక్ష్మారెడ్డి,వేణుపాల్,రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని వివిధ గ్రామాల్లో వున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ టీచర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని లేని పక్షంలో వలంటీర్లనైనా నియమించాలని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేశ్వరరావు కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో బుధవారం వర్షం కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పెద సింగరస్వామి, చినసింగర స్వామి, గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● క్రోసూరు: మండలంలోని దొడ్లేరులో ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మల్లేష్, రత్నకుమార్, టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

● మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి ఇవ్వటం పట్ల పల్నాడు జిల్లా క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు గొట్టిముక్కల బలరామకృష్ణంరాజు బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

అచ్చంపేట : అచ్చంపేట పీఏసీఎస్ చైర్మన్‌గా కొప్పురావూరి కోటేశ్వరరావు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈయనతో పాటు డైరెక్టర్లు షేక్ ఖాజావలి, కొరివి నరసింహారావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

● అచ్చంపేట: మండలంలోని వేల్పూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో(ఎస్సీ కాలనీ) 63మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్ళు, గైడ్లు అందజేశారు. స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్, పొన్నెకంటి గోవిందరావు, శిఖా పెద నాగయ్య, హెచ్‌ఎం, ఫౌండేషన్ ప్రతినిధి పీ కరిముల్లాబాబు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: తుళ్ళూరుకు చెందిన న్యాయవాది ఎం మోహన్‌రావు అతని భార్యపై దాడి చేయటాన్ని ఖండిస్తూ బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో జీ అజయ్ కుమార్, బీఎల్ చిన్నయ్య, చిన్నం మణిబాబు, జానీ ఖాజావలి, దివ్వెల శ్రీనివాసరావు, గోపాలకృష్ణమూర్తి, సేవా బాబూరావు, జొన్నలగడ్డ విజయకుమార్, బొక్కా సంగీతరావు, రాజవరపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు: కౌలు రైతులందరూ కౌలు ధ్రువీకరణ పత్రాలు పొందాలని ఏవో కే దేవదాసు కోరారు. బుధవారం గుండ్లపల్లి, బాలాజీనగర్ తండాలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాగుచేస్తున్న పంటలకు రైతులు బీమా చేయించుకోవాలని సూచించారు.

● రాజుపాలెం: టీడీపీ వాణిజ్య విభాగ నియోజకవర్గ ప్రధానకార్యదర్శిగా రాజుపాలెంకి చెందిన పెద్దింటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన నియమకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రికల్చర్ మోడల్ నియోజకవర్గంగా గురజాల

● ఎమ్మెల్యే యపతినేని శ్రీనివాసరావు



దాచేపల్లి: నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యపతినేని

దాచేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ మోడల్ నియోజకవర్గంగా గురజాలను రూపొందిస్తామని ఎమ్మెల్యే యపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరగనున్న కిసాన్ మేళా కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఆయన యార్డులో పర్యటించారు. గురువారం నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో వందకు పైగా స్టాల్స్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే యరపతినేనిమాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందేలా రైతులను చైతన్య పరిచేందుకు కిసాన్ మేళాను నిర్వహిస్తున్నట్టు వివరించారు.

5, 6 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం దాచేపల్లి నగర పంచాయతీలోని 5, 6, 7 వార్డుల్లో పర్యటించారు. వేముల కృష్ణ ఆధ్వర్యంలో వడియ రాజులు, బీసీ వర్గాలు ఘనంగా ఎమ్మెల్యే యరపతినేనికి స్వాగతం పలికారు. కాలనీలో దివ్యాంగుడైన వేముల సత్యనారాయణకు రూ 5వేలు ఆర్థిక సాయం చేశారు. తనతో పాటు 35 సంవత్సరాలుగా నడిచిన ప్రతి కార్యకర్తను గుర్తు పెట్టుకుంటానని, వారి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని యరపతినేని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పులుకూరి కాంతారావు, తంగెళ్ళ శ్రీనివాసరావు, వేముల వినోద్‌రెడ్డి, బద్రి, నర్ర పుల్లయ్య, మునగ నిమ్మయ్య, కొప్పుల గిరి, పగడాల భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, అంబటి మల్లి, తోట వెంకటేశ్వర్లు, మామిడి చంద్ర, కూరాకుల నాగేశ్వరరావు, వేముల తిరుమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే

గురజాలటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో గల ఎస్సీ కాలనీలో ఎన్నో యేళ్లుగా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా బోరు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని కూటమి నేతలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కూటమి నేతలు బోరు ఏర్పాటుచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని కాలనీ వాసులు అన్నారు. ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకురాగానే తక్షణమే బోరు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారని కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి శంకరరావుకు లేదు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి గాని, అర్హత గాని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు లేదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోయాక సంవత్సరంపాటు కన్పించకుండాపోయి ప్రజలను, పార్టీ కార్యకర్తలను పట్టించుకోకుండా ఇప్పుడు నియోజకవర్గానికి వచ్చి అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. తాను నిత్యం ప్రజల మధ్య ఉంటున్నాని, ఎప్పుడైనా నా వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకొనే అవకాశం నియోజకవర్గ ప్రజలకు కల్పించామన్నారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీకి చెందిన బీసీ నాయకుడి చేతిలో ఓడిపోయాడని, పెదకూరపాడు నియోజకవర్గానికి వచ్చి ప్రగల్భాలు పలికితే ఇక్కడ బీసీ నాయకులు తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు విమర్శలు గాని, ప్రగల్భాలు గాని మానుకొని తమ పని తాము చూసుకుంటే మంచిదని హితవు పలికారు.

భువనచంద్ర చెక్ డ్యామ్ నిర్మాణానికి కృషి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శ్రీకారం చుట్టారు. బుధవారం రాజుపాలెం, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి భువనచంద్ర చెక్‌డ్యామ్ నిర్మాణం జరిగితే 4500 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. వెంటనే కన్నా స్పందించి సంబంధిత అధికారులను పిలిపించి రైతులతో భువనచంద్ర చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లి డ్యామ్ ప్రదేశాన్ని పరిశీలించారు. రిపోర్టు తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి నిధులు విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నల్లమోతుల శ్రీనివాసరావు, పల్లపాటి పెద్దిరాజు, భైరా తిరుపతిరావు, పూర్ణయ్య, కేద్రినాథ్, కరిమూల్లా, షేక్ అల్లాభక్షు, బాబావలి ఎమ్మెల్యే కన్నాను సన్మానించారు.

మధ్యవర్తిత్వమే మేలు

● లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమాలలో న్యాయాధికారులు



పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారి ప్రవల్లిక, న్యాయవాదులు

పిడుగురాళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ టి.ప్రవల్లిక ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం.. రాజమార్గం అంటూ నినాదాలు ఇస్తూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ప్రవల్లిక మాట్లాడుతూ గ్రామస్థాయిలో పరిష్కరించుకోదగిన కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ ర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు కంభంపాటి కోటేశ్వరరావు, నవ్య, లోకేశ్వరి, మాణిక్యం, ప్రశాంత్‌నాయక్, సాగర్, వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, శ్రీనివాసరావు, జాకబ్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాసకల్యాణ్



సత్తెనపల్లి: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ

● గురజాల లీగల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం గురజాల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్ శరత్‌బాబు, సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాల కోర్టు ఆవరణలో మీడియేషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి మీడియేషన్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు, కోర్టు సిబ్బందితో ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీను, ఉపాధ్యక్షుడు చీతిరాల కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, భువనగిరి హనుమంతరావు, కలివెల ప్రభుదాసు, బండి వీరభద్రుడు, శానంపూడి వెంకటేశ్వరరెడ్డి, కేవీ నాగార్జున, వై వెంకటేశ్వర్లు, చిరంజీవి, కనకం ఆదినారాయణ, జానీబాష, జ్ఞానసుందరి తదితరులు పాల్గొన్నారు.

● మాచర్లటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారంలో మధ్యవర్తుల ప్రమేయం ఎంతో ఉపయోగకరమని న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్ అన్నారు. మధ్యవర్తిత్వం పట్ల అవగాహన కల్పించేందుకు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా వివాదంలో పరిష్కార మార్గాలుంటే సెక్షన్ 88 కింద ప్రత్యామ్నాయ పరిష్కార విభాగానికి న్యాయమూర్తి పంపవచ్చన్నారు. కోర్టులోని ఇరువర్గాలు మధ్యవర్తిత్వంతో కేసు పరిష్కారం చేసుకుంటామని మెమో దాఖలు చేయవచ్చన్నారు. కేసు త్వరగా పరిస్కారమైతే ఇరువర్గాలకు మేలు కలుగుతుందన్నారు. ర్యాలీలో పట్టణ సీఐ ప్రభాకరరావు, న్యాయవాదులు రమేష్‌బాబు, శ్రీనివాసరావు, జి వెంకటేశ్వర్లు, గట్ల సత్యనారాయణ, కృష్ణమూర్తి, గంగుల శ్రీనివాసరావు, అనిల్, పుల్లారావు, శేశరెడ్డి, గౌస్ బాష తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు హాలులో బుధవారం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మధ్యవర్తిత్వం, రాజీ పథకంపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి జూనియర్ కళాశాల వరకు ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, హనుమంతురావు, వెంకటేశ్వరరెడ్డి, కొంగర హరిసత్యనారాయణ, షేక్ జానీబాషా, కనకం ఆదినారాయణ, కెవి నాగార్జున, సీఐ భాస్కర్, ఎస్‌ఐ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీ విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్ అదాలత్ ద్వారా సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ ర్యాలీలో న్యాయమూర్తులు కౌషిత్ హుస్సేన్, ప్రియదర్శిని, జే సుజన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌కాశయ్య

క్రోసూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసిందని మాజీ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య అన్నారు. క్రోసూరు ఎస్టీ కాలనీలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు దుద్దుల యోహాన్, సత్తెటి లక్ష్మీకొండలు, పార్టీ నాయకులు నలజాల కోటేశ్వరరావు, అనుమాల పూర్ణ, బండారు మైసూర్‌బాబు, చిలకా రాంబాబు, కఠారు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవి ఏదైనా బాధ్యతగా పనిచేయాలి

అమరావతి, జులై 16(ఆంధ్రజ్యోతి) పార్టీ పదవైన నామినేటెడ్ పదవైన బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని తురగవారిపాలెంలో జరిగిన మునగోడు పీఏసీఎస్ చైర్‌పర్సన్, పర్సన్స్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా ప్రమాణం చేయించారు. అనంతరం పలువురు రైతులకు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రుణాలను అందజేశారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల శౌరయ్య, జీడీసీసీబీ మేనేజరు పి.సుధీర్, కె.గోపి, సాయిరామ్, టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం మండలంలోని మునగోడులో నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

బెల్లంకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చండ్రాజుపాలెంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఓర్సు రాంబాబు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం: మండలంలోని మోర్జంపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని దేశం పార్టీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గడిపూడి శ్రీకాంత్ ముఖ్య అతిధిగా హాజరై ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాడిపర్తి నరసింహారావు, నాయకులుపాల్గొన్నారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని 13, 14 వార్డుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, జే శ్రీనివాసరావు, ఏ మోహన్ కృష్ణ, ఎన్ రమణ, ఎస్‌కే బాషా, ఎస్ నరసింహారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

మాచర్లటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి అండగా నిలిచారు. వెల్దుర్తిలోని చెంచుకాలనీకి చెందిన ఉడతల పెద అంజమ్మ, చిన అంజమ్మలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న గౌతమ్‌రెడ్డి వారి కుటుంబపోషణ నిమిత్తం నిత్యావసర సరుకులు అందజేయడంతోపాటు వారి వైద్య ఖర్చులు తానే అందజేస్తానని హామీనిచ్చారు. గౌతమ్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం టీడీపీ నేతలు బ్రహ్మచారి, షేక్ ఖాదర్‌వలి తదితరులు బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి సరుకులు, నగదు అందజేశారు.

పాఠశాల డీఈవో తనిఖీ

పిడుగురాళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని లెనిన్ నగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం పల్నాడు డీఈఓ చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పాఠ్యాంశాలకు సంబంధించి ఉపాధ్యాయుల బోధన ఎలా వుంది.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

బాలల భవిష్యత్తుకు.. బంగారు బాట

పిల్లల జీవితంలో మొదటి ఐదు సంవత్సరాలు కీలకం. ఈ దశలో వేసే పునాది వారి భవిష్యత్‌కు బంగారు బాట అవుతుంది. దీనిని గురించిన ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 బాల్యారంభ సంరక్షణ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో నవ చేతన బాల్యారంభ ప్రేరణ జాతీయ చట్టాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఒక క్రమ పద్ధతి లో బోధన, అభ్యసనకు దృష్టి సారించింది. నవ చేతన, ఆధార శిల పుస్తకాలు రూపొందించి ఉమ్మడి జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది.





అంగన్ వాడీలకు ఆధార్ శిల పుస్తకాలు పంపిణీ

నవ చేతనలో..

నవ చేతన పుస్తకంలో గర్భధారణ దశ నుంచే మానసిక, శారీరక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్ వాడీ కార్యకర్తలకు ఈ పుస్తకం దోహద పడుతుంది. నేను, నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం, రుచులు వంటి అంశాలను పాఠ్యాంశాలుగా ఇచ్చారు. కార్యకర్తలు మూడు సంవత్సరాల లోపు వారికి వీటిని బోధించటంతో పాటు వారి తల్లిదండ్రులకు వివరించాలి. వారు ఇంటి వద్ద అనుసరించాలి. చిన్నారుల్లో విష పరిజ్ఞానం పెంపొందించేలా కబుర్లు, కథలు ఎలా చెప్పాలనేది వీటిని చిత్రాల సహా ఇచ్చారు. - సత్తెనపల్లి

● ఆధార్ శిలలో కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎక్కువగా మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు వయస్సు వారు ఉంటారు. వారికి పాఠ్యాంశాలు వినోదాత్మకంగా ఎలా బోధించాలనే అంశాలను ఆధార్ శిల పుస్తకంలో రూ పొందించారు. ఆడుతూ, పాడుతూ అభ్యాసన జరిగేలా నీతి పద్యాలు వీటిలో పొందు పరిచారు. ఇందులోని ఇతి వృత్తాలు అంగన్ వాడీ కార్యకర్తలకు సహాయ పడేలా రూపు దిద్దారు. నా గ్రామం, నా కుటుంబం, రుతువులు, పండుగలు, పండ్లు, కూరగాయలు ఇతి వృత్తాల ద్వారా పిల్లలు స్థానిక పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవటానికి దోహద పడతాయి.



పుస్తకాలు సరఫరా చేశాం
: ఎం ఉమాదేవి, పీడీ, ఐసీడీఎస్, పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నవ చేతన, ఆధార శిల పుస్తకాలను సరఫరా చేశాం. ఇందులోని అంశాలను చిన్నారులు తల్లిదండ్రులకు ఎలా తెలియ జేయాలో ప్రాజెక్టుల స్థాయిలో కార్యకర్తలకు అవగాహన కల్పించాం. వీటి ద్వారా పిల్లల భవిష్యత్ సమగ్ర అభివృద్ధి చెందుతుంది.

వసతి.. వారెవ్వా



● కుక్కల కోసం ఏర్పాటు చేసిన ఏసీ హాస్టల్



- కుక్కల కోసం ఏసీ హాస్టళ్లు
- ఆహ్లాదకరంగా డాగీస్ జోన్ల ఏర్పాటు
- నిద్రకు బెడ్లు.. ఆడుకునేందుకు బొమ్మలు

సమాజంలో జంతు ప్రేమికుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. ముఖ్యంగా కుక్కలను ప్రాణ ప్రదంగా పెంచుకునే వాళ్లు ఎక్కువయ్యారు. ఏదైనా అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తాము పెంచుకునే కుక్కలను అక్కడా ఇక్కడ వదిలి వెళ్లడానికి కుదరని పరిస్థితి. అటువంటప్పుడు ఎవరో ఒకరు వాటి కోసం ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. ఈ ఇబ్బందిని నివారించేందుకు కుక్కలకు కూడా ప్రత్యేకమైన హాస్టళ్లు(వసతి గృహం) ఏర్పాటవుతున్నాయి. ఆయా హాస్టళ్లు కూడా ఎలాగంటే అలాకాకుండా అత్యాధునిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలతో నెలకొల్పుతున్నారు.

- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి

ఆహ్లాదం.. ఆనందం

ప్రాణపదంగా, అపురూపంగా పెంచుకుంటున్న కుక్కలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా డాగీస్ జోన్లు ఏర్పాటవుతున్నాయి. ఇక్కడ 24 గంటలు ఏసీ ఉండేలా జాగ్రత్త తీసుకుంటారు. ప్రతీ కుక్కకు విశాలంగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తున్నారు. అందులోనే పడుకునేందుకు బెడ్, ఆడుకునేందుకు బొమ్మలు ఉంటున్నాయి. వసతిలో ఉండే కుక్కలకు రోజుకు మూడు పూట్ల భోజనం పెడతారు. అది కూడా చాలా విలువైన మెనూ అనే చెప్పవచ్చు. భోజనం పెడుతున్నప్పుడు వీడియో తీసి యజమానికి పంపుతారు. ఉదయం, సాయంత్రం వాకింగ్.. జాగింగ్‌కు కూడా ఏర్పాట్లు చేశారు.

శిక్షణ పొందిన కేర్ టేకర్లు..

డాగీస్ జోన్లలోకి వచ్చే కుక్కల సంరక్షణ కోసం శిక్షణ పొందిన కేర్ టేకర్లను నిర్వాహకులు నియమించుకుంటున్నారు. యజమాని లేకున్నా కుక్క దిగులు పడకుండా కేర్‌టేకర్లు వాటిని మచ్చిక చేసుకుంటున్నారు. ఇక్కడ గంట, రోజు, నెల ఇలా ఎంత సేపు అయినా కుక్కలను ఉంచవచ్చు. చివరికి విదేశాలకు వెళ్లే వాళ్లు మూడు, నాలుగు నెలలు కూడా హాస్టల్‌లో ఉంచి వెళ్ళ వచ్చు. ఆ సమయంలో కుక్కల వసతి తో పాటు, ఆరోగ్య సంరక్షణ, టీకాలు ఇచ్చే విషయం అన్నీ హాస్టల్ యజమానులే చూసుకుంటారు.



కుక్కకు హెయిర్ కటింగ్

ఆంధ్రప్రదేశ్‌లో మొదటగా..



2014లో కుక్కను పెంచుకున్నాను. దానికి ఏదైనా జబ్బు చేస్తే అవసరమైన మందులు అందుబాటులో ఉండేవి కావు. ప్రతి దానికి హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయంలో వచ్చిన ఆలోచనతోనే గుంటూరు అరండల్‌పేటలో డాగిస్ జోన్ ఏర్పాటు చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో కుక్కలకు ఏసీ హాస్టల్ ఏర్పాటు చేయటం ఇదే మొదటిది. ఇక్కడ కుక్కలకు అవసరమైన మందులు, ఆహారం, వసతి, టీకాలు ఏర్పాటు చేశాను. దానికి ఎక్కువ మంది మద్దతు లభించింది. దీంతో కుక్కల కోసం పార్లర్ కూడా నిర్వహిస్తున్నాను.

- షేక్ మక్బుల్



గోరంట్లలో కుక్కల కోసం డాగిస్ జోన్ పేరు తో ఏర్పాటు చేసిన ఏసీ హాస్టల్

● **వ్యాపారంలో వాటా అంటూ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి మోసం**

వ్యాపారంలో వాటా ఇస్తానంటూ కాకినాడకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు కె రాజభాస్కర్‌రెడ్డి, రూ.1.77కోట్ల మేర మోసం చేశాడని ఆరోపిస్తూ బాపట్లకు చెందిన దొప్పలపూడి విష్ణు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ హయంలో తనపై అక్రమ కేసులు నమోదు చేయడంతోపాటు చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

వినతుల స్వీకరణ.. పరిష్కారానికి హామీ

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో బుధవారం 67వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలిసిన మంత్రి వివిధ సమస్యలపై వారినుండి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

☛ కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఏపీ ఐఐసీ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2016లో ప్రభుత్వం భూ ములు సేకరించిందని, ఐతే కొంతమంది రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని గ్రామానికి చెందిన డీ వెంకటరావు మంత్రి లోకేశ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అక్రమాల కారణంగా పరిహారం అందక తాము తీవ్రంగా నష్టపోయామని విచారించి తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ వైసీపీ ప్రభుత్వంలో తొలగించిన

● **67వ రోజు మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్**
● **స్వయంగా కలిసి సమస్యలు విన్నవించిన ప్రజలు**

వితంతు పెన్షన్‌ను పునరుద్ధరించాలని గుండిమెడకు చెందిన పులపా మంగమ్మ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో గత 19ఏళ్లగా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 2400 మందికి హెచ్‌ఆర్ పాలసీ లేదా మినిమమ్ టైమ్ స్కేల్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్ జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకానికి సంబంధించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



వృద్ధురాలి సమస్య వింటూ..

తిరుపతి నుండి తిరుమలకు పూలు తీసుకెళ్లేందుకు టోల్ గేట్ పర్మిషన్ ఇవ్వాలని శ్రీ బాలాజీ ఫ్లవర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత 30 ఏళ్లగా పూల వ్యాపారం చేస్తున్నామని 2023 ఏడాది నుండి తమకు అనుమతి నిలిపివేశారని మంత్రి దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ శ్రీకాకుళం జిల్లాలో మజ్జిగూడెం ఎత్తిపోతల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని హీర మండలానికి చెందిన గొళ్ల సింహాచలం మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 2018లో ఎత్తిపోతల నిర్మాణ పనులు ప్రారంభించగా వైసీపీ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ డీఆర్‌డీఏ వెలుగు, చంద్రన్న బీమా కాల్ సెంటర్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీవీడబ్ల్యూవీ, వీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం జీతాలు నిలిపి వేసిందని తమకు పెండింగ్ జీతం చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ సెక్యూరిటీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు ప్రజలు దివ్యాంగుల నుండి మంత్రి లోకేశ్ స్వయంగా అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బాపట్ల టౌన్‌హాలుకు 120 వసంతాలు

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రకమైన బాపట్ల టౌన్‌హాలు నిర్మించి 119 సంవత్సరాలు పూర్తిఅయ్యింది. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు పట్టుగొమ్మగా టౌన్‌హాలు నిలిచింది. జాతిపిత మహాత్మా గాంధీతోపాటు జవహర్‌లాల్‌నెహ్రూ, డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ వంటి ఎందరో జాతీయనాయకులు ఇక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1913 మే నెలలో జరిగిన

● **1913లో ప్రథమాంధ్ర మహాసభకు ఇదే వేదిక**

ప్రథమాంధ్ర మహాసభకు టౌన్‌హాలు వేదికగా నిలిచింది. బాపట్లలో టౌన్‌హాలు నిర్మించాలని 1902 డిసెంబరు 5న జరిగిన ఓ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అప్పటి తహసీల్దార్ కె.శేషాచలపతిపంతులు ఆధ్వర్యంలో అధికారులు, న్యాయవాదులతో కమిటీ ఏర్పాటైంది. 1903 సెప్టెంబరులో ఎడ్వర్డ్ చక్రవరి పట్టాభిషేకం రోజునే బాపట్ల కోర్టులో జిల్లా మున్సిఫ్‌గా తిరువెంకటాచారి బాధ్యతలు స్వీకరించారు. ఆయన టౌన్‌హాలు నిర్మాణంలో ప్రత్యేక ఆసక్తి చూపారు. అప్పట్లో బాపట్ల తాలూకా మిరాశిదారుగా ఉన్న జాగర్ల మూడినాయుడు ఆధ్వర్యంలో గ్రామ గ్రామం తిరిగి టౌన్‌హాలు నిర్మాణానికి విరాళాలు సేకరించారు. 7,253 రూపాయల 15అణాల 3పైసలు విరాళలుగా వసూలయ్యాయి. జమ్ములపాలెం మిరాశిదారు కుర్రా ముత్తయ్య చౌదరి, న్యాయవాదులు దేశిరాజు కృష్ణయ్యపంతులు, చేరగుడి వెంకటాద్రిపంతులు టౌన్‌హాలు నిర్మాణానికి స్థలం ఇచ్చారు. 1905 జనవరి 24న టౌన్‌హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి బాపట్ల తాలూకా సబ్ మేజిస్ట్రేట్ బి.రాజగోపాలరావు, బ్రహ్మాండం బాపయ్యపంతులు వంటి ప్రముఖులెందరో టౌన్‌హాలు నిర్మాణానికి కృషి చేశారు. 1905 జూలై 17న టౌన్‌హాలు ప్రారంభమైన తర్వాత అప్పటికే బాపట్లలో ఉన్న డైమండ్ జూబ్లీక్లబ్, న్యూస్ పేపర్ క్లబ్‌లను ఇందులో విలీనం చేశారు. 1908లో బాపట్లకు జిల్లా మున్సిఫ్‌గా వచ్చిన న్యాపతిబల రాందాసు పంతులు చొరవతో టౌన్‌హాలులో టెన్నీస్ కోర్టు కూడా ప్రారంభమైంది. నిత్యం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో టౌన్‌హాలు అలరారుతుండేది. ఎన్నోనాటిక ప్రదర్శనలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసేవారు. ఈ వాతావరణమే పద్మశ్రీ స్థానం నరసింహారావు, అద్దంకి శ్రీరామమూర్తి వంటి మహానటులకు ప్రేరణ ఇచ్చింది.



టౌన్‌హాలు

కార్మెల్ కొండ.. అద్భుతాల నిలయం



ఫిరంగిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనేక అద్భుతాలకు నిలయంగా కార్మెల్ కొండ భాసిల్లుతుందని నల్గొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందుజోజి తెలిపారు. ఫిరంగిపురంలో కార్మెల్ మహోత్సవాలు బుధవారం మూడో రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల భక్తులు లక్షలాదిగా తరలివచ్చి మహోత్సవాల్లో పాల్గొని తరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి తలనీలాలు తీయించుకున్నారు. కార్మెల్ మాత స్వరూపానికి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గోవిందు జోజి ఆశీర్వదించారు. అనంతరం సమిష్టి దివ్య పూజాబలిలో గోవిందు జోజి భక్తులకు సందేశ మిచ్చారు. సకల మానవాళి మాతగా మరియతల్లి వెలుగొందు తుందన్నారు. జపమాల, ఉత్తరీయంతో మాత ను ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. కార్మెల్ కొండ కు ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను బాల ఏసు కథెడ్రల్ దేవాల య ఫాదర్ మాలపాటి ఫాతి మామరెడ్డి కోరారు.

● **కార్మెల్‌మాత మహోత్సవాల్లో గోవిందుజోజి**



దివ్య పూజాబలిలో ప్రసంగిస్తున్న నల్గొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందుజోజి

జడ్పీలో ముదురుతున్న.. అవుట్ సోర్సింగ్ వివాదం

● **సీఈఓ ప్రకటనతో అంతా గందరగోళం**

గుంటూరు సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ లోని ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులు వ్యవహారం చినికి చినికి గాలి వానలా మారుతుంది. 22 నెలలుగా తమకు జీతాలు చెల్లించటం లేదంటూ జడ్పీ లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వ హించిన విషయం విదితమే. ఆ ధర్నా వ్యవహారం పై స్పందించిన సీఈఓ జ్యోతి బసు అసలు వాళ్లు జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే కాదంటూ సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో బుధవారం వ్యవహారం మరింత వేడెక్కింది. జీతాలు ఇవ్వటం లేదంటూ ధర్నా నిర్వహించిన ఉద్యోగులు జిల్లా పరిషత్‌లోని కీలకమైన ఛాంబర్‌లలో విధుల్లో ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. వాళ్లు జడ్పీ ఉద్యోగులు కాకుంటే అక్కడ ఎందుకు ఉన్నారంటూ పలువురు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు.



జడ్పీలో విధుల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



● **జిల్లా పరిషత్‌కు తాళాలు తీసేది వాళ్లే...**

ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యవహారంలో అధికారులు చెబుతున్న మాటలు అవాస్తవాలు అని బాధితులు చెబుతున్నారు. ప్రతి రోజూ జిల్లా పరిషత్ తాళాలు వేసేది.. తీసేది అవుట్ సోర్సింగ్ ఉద్యోగి హరీష్ అని చెబుతున్నారు. అతను కొంతకాలం ప్రస్తుత జడ్పీ సీఈఓ ఇంట్లో కూడా వాచ్‌మెన్ గా పని చేసినట్లు తెలుస్తున్నది. గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల కమాండ్ కంట్రోల్ రూమ్, పీ ఎఫ్ సెక్షన్, ఇతర కీలకమైన సెక్షన్‌లలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణం, ఛైర్మన్ క్యాంపు కార్యాలయం శుభ్ర పరచటం వంటి పనులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్నారు. 365 రోజులు విధులకు హాజరై పనులు చేస్తున్నా వాళ్లు ఉద్యోగాల్లో లేరని సీఈఓ ప్రకటన చేయటం వివాదాస్పద మయ్యింది.

● **2022 లోనే తీర్మానం...**

అవుట్ సోర్సింగ్ విధానంలో 10 మందిని నియమించేందుకు అప్పటి కలెక్టర్ అనుమతితో జిల్లా పరిషత్ లో 2022 జనవరి 28న తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింప జేశారు. నియమించిన ఉద్యోగులకు జడ్పీ నిధుల నుంచి చెల్లింపులు చేసేలా తీర్మానంలో పేర్కొన్నారు. ఆ తీర్మానం ఆధారంగానే ఈ ఆరుగురుని విధుల్లో నియమించారు. 2023 వరకు జీతాలు కూడా సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించారు. మోహన్‌రావు డిప్యూటీ సీఈఓ గా పనిచేసిన కాలం లో 2023 జూలై 21 వ తేదీన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు విభాగాలను కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. 2023లో వారిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి, జీతాల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. కొందరిని రోజు వారీ వేతనం కింద విధుల్లోకి తీసుకుంటున్నట్లు మోహన్ రావు ఇంచార్జి సీఈఓ గా ఉన్నప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఆ లెక్క న ప్రస్తుతం జిల్లా పరిషత్ లో ఉన్న ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చట్ట ప్రకారం విధుల్లో ఉన్నట్లుగానే స్పష్టం అవుతున్నది.

'నల్ల బర్లీ పొగాకు సాగు చేయవద్దు'

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రాంతంలో నల్లబర్లీ పొగాకును సాగుచేయవద్దని రైతులను వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అధికారి కేవీ శ్రీనివాసరావు బుధవారం కోరారు. మండలంలోని రాజాపేట, గోపాలంవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఎవరైనా పొగాకు సాగుచేస్తే పంట ఏ దశలో ఉన్నా తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, ఈ నెలాఖరు లోగా పంటల బీమా పథకంలో రైతులు చేరాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఏవో సీహెచ్ సరిత, ఏఈవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చిలకలూరిపేటలో 5,901 బంగారు కుటుంబాల గుర్తింపు

● కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీ4 పథకం ద్వారా పట్టణంలోని బంగారు కుటుంబాలకు చేయూతనివ్వటానికి, పేదరికాన్ని పారదోలడానికి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో గట్టి కృషి చేస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇప్పటివరకు పట్టణంలో 5,901 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ నెల 25వ తేదీలోగా వార్డు సభలను నిర్వహించి బంగారు కుటుంబాల తుది జాబితాను నిర్ధారిస్తామన్నారు. పట్టణ పరిధిలో ఇప్పటికే 1,172 బంగారు కుటుంబాలకు 373మంది మార్గదర్శకులను అనుసంధానించామని వివరించారు. మిగిలిన కుటుంబాలకు కూడా మార్గదర్శకులను గుర్తించి అనుసంధానిస్తామన్నారు. కాగా చిలకలూరిపేట నియోజకవర్గంలో పీ4 పథకం పరిధిలో 9,818మంది బంగారు కుటుంబాలు ఉండగా 4,523 మందికి మార్గదర్శకులను ఇప్పటివరకు గుర్తించామన్నారు.

పశువులు పట్టణంలో సంచరిస్తే కేసులు నమోదు చేస్తాం

మున్సిపాలిటీ పరిధిలో ఆవులు, గేదెలు రోడ్లపై తిరిగితే యజమానులపై కేసులు నమోదు చేస్తామని కమిషనర్ శ్రీహరిబాబు హెచ్చరించారు. పశువుల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. మూడు రోజుల్లో పశువుల యజమానులు పశువులను రోడ్లపై వదిలివేయకుండా, వాటిని తమ సంరక్షణలో ఉంచుకోవాలని లేకుంటే ఆ పశువులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. యజమానులపై కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం

నరసరావుపేట లీగల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థిని ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదని 16వ తేదీ మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో సదరు విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు. గుంటూరుకు చెందిన విద్యార్థిని మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతోంది. పట్టణంలోని అరండల్‌పేటలోని వసతి గృహంలో ఉంటోంది. ఈ నెల 14వ తేదీన విద్యార్థిని ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఆమె తండ్రి వైద్యపరీక్షలు చేయించి 15వ తేదీ ఉదయం హాస్టల్‌లో వదిలిపెట్టాడు. అనంతరం విద్యార్థినికి తండ్రి ఫోన్ చేయడంతో ప్రతిస్పందించలేదు. కళాశాలలో విచారించగా కళాశాలకు కూడా వెళ్లలేదని తెలుసుకున్నాడు. ఈ నేపథ్యంలో సాయంత్రం వరకు వెతికి ఆచూకీ లభించకపోవడంతో మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు జిల్లా కోర్టు ఏపీపీ రాజీనామా

నరసరావుపేట లీగల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని న్యాయాధికారికి సమర్పించారు. ప్రాసిక్యూషన్ డైరెక్టరుకు ఈమేరకు పోస్టులో పంపారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో నియమితులైన ఏపీపీలు, ఏజీపీలను తొలగించి కొత్తవారిని నియమించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదనే వార్తల నేపథ్యంలో మల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం.

19న దేవాలయ భూముల కౌలు వేలం

రొంపిచర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలోని శ్రీశంకర స్వామి, శ్రీమదనగోపాలస్వామి, అంజనేయ స్వామి దేవాలయ భూముల కౌలు వేలంను ఈ నెల 19వ తేదీన శంకరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణ అధికారి పుణ్యాల వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. దేవదాయ శాఖ చట్టం పరిధికి లోబడి ఈ వేలం జరుగుతుందన్నారు. 2025-26 నుంచి 2027-2028 వరకు మూడు సంవత్సరాల పాటు కౌలుకు వేలం జరుగుతుందన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన డీఎల్‌పీవో

రొంపిచర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో పారిశుధ్య పనులను డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యంపై ఫిర్యాదులు అందటంతో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా గ్రామంలో పారిశుధ్యంపై ఫిర్యాదులు అందినట్టు పేర్కొన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ సతీష్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావులు ఉన్నారు.

హింసను రెచ్చగొడుతున్న వైసీపీ

● ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలి
● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో హింసను రెచ్చగొడుతున్న వైసీపీ గుర్తింపును ఎన్నికల సంఘం తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని 3వ వార్డు ఇందిరానగర్‌లో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం ప్రచారంలో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకొని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తిగా మారిన వైసీపీకి ప్రజల తిరస్కారం తప్పదన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలానే హింసాప్రవృత్తిని ప్రదర్శించారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను టార్గెట్‌చేసి ప్రాణాలు తీశారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగాల కన్నా గుట్కా, డ్రగ్స్ అలవాటు చేయడమే జగన్ పాలనలో ప్రధానంగా మారిందని, కళాశాలల్లో గంజాయి అమ్మడమేకాక రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం సరఫరాను ఇంకా ఎవరూ మరచిపోలేదని ధ్వజమెత్తారు. అప్పట్లో జగన్ నిర్వాకానికి 35లక్షల మందికి పైగా ఆసుపత్రుల పాలవ్వగా 30వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నామని, తొలి నెలలోనే పింఛన్లు పెంచామన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పథకం కింద ప్రతి బిడ్డకు ఆర్థికసాయం రూపంలో ఫలితాలు ప్రజల ముందే ఉన్నాయన్నారు. జగన్ హయాంలో పరిశ్రమలు పారిపోతే కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోనే రూ.9.3లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయన్నారు. వీటి ఫలితంగా 8.5లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయని, అది భరించలేకనే జగన్ కడుపుమంటతో రగిలిపోతున్నారన్నారు. శాంతి, అభివృద్ధికి అడ్డుపడే అలాంటి పార్టీలకు దేశంలో స్థానంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేటలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక నాయకులు చల్లా సుబ్బారావు, సీలు బాబురావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పట్టణంలోని ప్రతి వ్యక్తి, ప్రతి వార్డు ఈ అభివృద్ధి ఫలాలు అందుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వార్డులో సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల మరమ్మతు, వీధి దీపాలు ఏర్పాటు వంటి అంశాలను పరిష్కరించడానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురపాలక పాఠశాలలో యూనిఫాం కిట్లు పంపిణీ

నరసరావుపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని అంబేడ్కర్ పురపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫాం కిట్లను పంపిణీ చేశారు. ఆయన స్వయంగా బోర్డుపై రాసి ప్రశ్నలు వేస్తూ విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకొని సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



నరసరావుపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

నరసరావుపేట లీగల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుధవారం న్యాయస్థానం భవనాల నుంచి మల్లమ్మ సెంటర్ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కే.మధుస్వామి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దావాలను మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. దీనిద్వారా ఇరుపక్షాలకు లాభం చేకూరుతుందన్నారు. తొలుత న్యాయవాద సంఘ కార్యాలయంలో న్యాయవాదులకు మీడియేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కోర్టు ఆవరణలో మీడియేషన్‌కు సంబంధించి రూపొందించిన కరపత్రాల స్టాల్ ఏర్పాటుచేసి కక్షిదారులకు కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో న్యాయాధికారులు ఎన్.సత్యశ్రీ, కే.మధుస్వామి, ఆర్.ఆశీర్వాదంపాల్, ఏ.సలోమి, ఎం.గాయత్రి, న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవీ సుబ్బారావు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఎం.ఎల్.ఎస్.సి సభ్యులు, మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి గుంటూరు జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం - దేశం కోసం అనే 90 రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణంలో వన్ కే వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం ద్వారా కేసులు, వివాదాలను పరిష్కరించుకునే మార్గాలను వివరించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.మహతి న్యాయవాదులతో కలిసి పట్టణంలో వన్‌కే వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కోర్టులో మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సెప్టెంబరు 30వరకు మధ్యవర్తిత్వం ద్వారా వినుకొండ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు అన్నింటిని కక్షిదారులు రాజీ చేసుకొని పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌నాయక్, ఎస్ఐ సత్యనారాయణ, వినుకొండ బార్ అసోసియేషన్ నాయకులు గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, వీవీ రమణారెడ్డి, శివశంకర్‌బాబు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న జడ్జి నరేంద్రరెడ్డి, న్యాయవాదులు, పోలీసులు



వినుకొండలో జరిగిన వన్‌కే వాక్‌లో పాల్గొన్న జడ్జి మహతి, న్యాయవాదులు

చిలకలూరిపేటలో ...

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మీడియేషన్ ఫర్ ద నేషన్ అనే నినాదంతో స్థానిక ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్లో ఉన్న అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు వద్ద నుంచి ప్రారంభించి నరసరావుపేటరోడ్డులో పోలిరెడ్డిపాలెం గంగానమ్మగుడి వరకు వన్ కే ర్యాలీ నిర్వహించి మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ చిలకలూరిపేట కోర్టులో కొత్తగా మధ్యవర్తిత్వం కమిటీని నియమించామని, ఈ కమిటీ ద్వారా ప్రతి రోజు పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, ఎస్ఐ లు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి విగ్రహ ఏర్పాటు నిర్ణయంపై ఆర్యవైశ్య నాయకుల హర్షం

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో 6.8 ఎకరాల భూమిని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు కేటాయించడంపై స్థానిక ఆర్యవైశ్య నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. చైత్ర సెంటర్లోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి, సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొత్త కోటేశ్వరరావు, రాచుమల్లు సూర్యారావు, భవనాశి కోటేశ్వరరావు, వెలంపల్లి రవి శంకర్, చేవూరి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వార్డులలో మున్సిపల్ చైర్మన్ పర్యటన

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9, 11 వార్డులలో బుధవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ పర్యటించారు. ఆ వార్డులలో చేపట్టిన, చేయవలసిన పనులు, నీటి సరఫరా పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. పార్టీలకు అతీతంగా అవసరమైనచోట్ల అభివృద్ధి పనులు చేపడతామని ఆయన ఆయా వార్డు ప్రజలతో చెప్పారు. మున్సిపల్ ఏఈ మణికుమార్, టీడీపీ నాయకులు బెజ్జం రవి, దాసు, ఫ్రాన్సిస్ ఆయన వెంట పర్యటనలో పాల్గొన్నారు.



సచివాలయ గోడకు అర్జీలు అంటిస్తున్న సీపీఐ నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

● సీపీఐ నాయకుల డిమాండ్

వినుకొండ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఎటువంటి అధికారపక్ష నాయకుల ఒత్తిళ్లు లేకుండా ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీ వాసులతో కలిసి సీపీఐ నాయకులు గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీవాసులు ఇళ్ల స్థలాలకు అర్జీలు పెట్టుకోవడానికి సచివాలయానికి వెళ్తే అక్కడ అధికారపక్ష పార్టీ నాయకులు ఇళ్ల స్థలాలు లేవు ఏమీ లేవు అంటూ అనడం ఏమిటని ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది ఇళ్ల స్థలాల విషయంలో ఏమైనా ఉంటే తమ వద్దకు రావాలంటూ అధికారపక్ష నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నారన్నారు. సిబ్బంది కూడా నాయకులు చెబితేనే మేము అర్జీలు తీసుకుంటామని అంటున్నారన్నారు. సిబ్బందికి నిరసనగా గోడకు ఇళ్ల స్థలాల అర్జీలను అతికిచ్చి నిరసన తెలియజేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే లబ్ధిదారులతో కలిసి కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి మల్లికార్జున, బ్రాహ్మణపల్లి ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

అక్వాటిక్ చాంపియన్‌షిప్-2025పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి ఎంపిక



కే శివసాకేత్

నరసరావుపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సబ్-జూనియర్స్, జూనియర్స్ అక్వాటిక్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి కే శివసాకేత్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ బుధవారం తెలిపారు. చాంపియన్‌షిప్-2025 పోటీలలో పాల్గొననున్న ఉమ్మడి గుంటూరు జిల్లా టీమ్‌కోసం గుంటూరు శ్యామలానగర్‌లోని ఎన్‌టీఆర్ స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన సెలక్షన్స్‌లో ఈ ఘనత సాధించాడన్నారు. కే శివసాకేత్ 50, 100, 200 మీటర్లు బటర్‌ఫ్లయ్, 200, 400 మీటర్లు ఫ్రీస్టయిల్ ఈవెంట్స్‌లో ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 19 నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగబోవు 10వ జూనియర్స్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొంటారన్నారు. కే శివసాకేత్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాస సాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదన్‌రావు, కోచ్ జీ సురేష్, తదితరులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలలో చౌదరయ్య స్కూలు విద్యార్థులకు 28 పతకాలు



పతకాలు సాధించిన చౌదరయ్య స్కూల్ విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలలో పట్టణంలోని చౌదరయ్య స్కూలుకు చెందిన విద్యార్థులు 28 పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. మొత్తం 30 మంది విద్యార్థులు అండర్ 14, 16 విభాగాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను స్కూలు చైర్మన్ ప్రత్తిపాటి సురేష్, డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ బాషా, వైస్ ప్రిన్సిపల్ రమ్య, పీఈటి రాజు, శ్రవణ్ లు అభినందించారు.



ఈపూరులో మద్యం దుకాణంలో తనిఖీచేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మద్యం దుకాణాలలో సీఐ తనిఖీలు

ఈపూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల, ఈపూరు మండలాలలోని మద్యం దుకాణాలను బుధవారం సీఐ డీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. బొల్లాపల్లి మండలం మేళ్ళవాగుకు చెందిన వ్యక్తిని మద్యం కేసులో తహసీల్దారు కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ప్రతి మద్యం దుకాణం వద్ద ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్యూఆర్ సర్వేపై ప్రచారం చేశారు. ప్రతి దుకాణం వద్ద క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉండాలన్నారు. మద్యం దుకాణాలలో ప్రభుత్వ నిబంధనలను తప్పక అమలు చేయాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని అలాచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

శావల్యాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు అంతర జిల్లా కమిటీగా ఏర్పాటైన విజిలెన్స్ అధికారుల బృందం శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బృందం సభ్యులు ఏలూరు జిల్లా కోటరామచంద్రాపురం ఏడీఏ బుజ్జిబాబు, విజయవాడ రీజినల్ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ ఉమర్, సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డిలు సొసైటీ కార్యాలయంలోని స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్స్, గోడౌన్‌లో నిల్వఉంచిన ఎరువుల నిల్వలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వారితో ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్ పాల్గొన్నారు.

సేంద్రియ, జీవన ఎరువులతో భూసారం మెరుగు

● కో-ఆర్డినేటర్ శివకుమారి



తూబాడులో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ శివకుమారి

నాదెండ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, జీవన ఎరువులు వాడటం వల్ల నేల ఆరోగ్య పరిరక్షణతో రైతులకు క్షేమకరని జిల్లా వనరుల కేంద్రం కో-ఆర్డినేటర్ ఎం.శివకుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని తూబాడులో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శివకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం ప్రణామ్‌లో భాగంగా రసాయన ఎరువులను వాడకాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులు వాడితే ఎరువులపై కంపెనీలకు ఇచ్చే రాయితీలు రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతాయన్నారు. జీవన ఎరువులు వాడటం వల్ల మిరప, ఇతర మెట్ట పంటలకు అనుకూలమన్నారు. వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.అరుణ మాట్లాడుతూ నేలను ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పంటతో నేలను కప్పి ఉంచినట్లయితే సూక్ష్మ జీవులు పెంపొంది నేల ఆరోగ్యం బాగు పడుతుందని వివరించారు. పురుగు మందులను రెండు లేదా మూడు రకాలు కలిపి వాడటం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఏవో పీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి

● ఏవో హరిప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో హరిప్రసాద్

యడ్లపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలిగిన అథరైజ్డ్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అలాగే విధిగా కొనుగోలు బిల్లులను తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ సూచించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని లింగారావుపాలెం, సొలస గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేయదలచిన పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటల సాగులో పాటించవలసిన జాగ్రత్తలు, పద్ధతుల గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానం, లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంటలు వేసిన తరువాత పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, పంటల విక్రయించుకునేందుకు నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే తాము వేసే పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ప్రధానంగా సాగుచేసే పత్తి పంటకు ఎకరాకు రూ.1,900లు ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. పంటనష్టం జరిగితే ఇన్సూరెన్స్ కింద రైతులకు పరిహారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించినందున ఈ ఏడాది పొగాకు సాగు చేపట్టవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో జీవన్‌నాయక్, ప్రసన్నకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు వినయ్‌కుమార్, గోపి, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడికి గురు పురస్కారం



డాక్టర్ అప్పారావుకు గురు పురస్కారాన్ని అందిస్తున్న సుబ్రహ్మణ్యా శర్మ

నాదెండ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామస్థుడు, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు డాక్టర్ సిరిపురపు అప్పారావుకు గురు పురస్కారాన్ని అందజేశారు. భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో నరసరావుపేటలో మూడురోజుల పాటు జరిగిన విద్వత్ మహా సభల్లో భాగంగా సాంస్కృతిక సేవా విభాగంలో ఆర్త మర్మరత్న శ్రీగురు పురస్కారాన్ని దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనువడు డాక్టర్ సుబ్రహ్మణ్యశర్మ, ఏపీ శాఖ అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాదుశర్మలు అందజేశారు.